www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



డీకే శివకుమార్‌ను కలిసిన మధుయాష్కి గౌడ్ 3

ఆదివారం, 13-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :129 Issue : 129 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



## మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

- అతిథులను ఆహ్వానిస్తే కమిషనరేట్‌కు సమాచారం ఇవ్వండి
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
- గణేష్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

3

## నిమ్స్ వైద్యులకు సీఎం అభినందనలు

3

# ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ హితవు



- ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ప్రజల తీర్పును గౌరవించాలంటూ హితవు
- రాజకీయ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- 'వేపాకులతో కొడతారు' అంటూ చమత్కారం
- పోలేపల్లి జాతర ప్రస్తావనతో సభలో నవ్వులు
- అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదంటూ ఆయన విమర్శించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**అహంకారం వదులుకోవాలంటూ**

అధికారం పోయింది.. కానీ అహంకారం పోలేదంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అహంకార ధోరణిని వీడాలని సూచించారు.

మిగతా 2వ పేజీలో..

## క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం

2



4

## పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్యే సంక్షేమానికి కీలకం



## తక్షణమే యూఎన్ఎస్‌సీ సంస్కరణలు

- ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ
- నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి
- అధికార పిరమిడ్‌ను మార్చాలి
- ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి

5

## ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య మౌలిక వసతులకు మరింత బలం

4



## 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- మంత్రి పొంగులేటి అబద్ధాల ప్రవాహం
- ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా సస్పెన్షన్
- తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలేవీ లేవు
- మా మామ భూమిపై అర్థసత్యాలు చెప్పారు
- రూ.15 కోట్ల విలువంటే.. రూ.50 లక్షలకే తీసుకోండి

2





## ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

- జేయూఏతో రక్షణ సామర్థ్యాలు మరింత బలోపేతం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో సమీక్ష
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్‌ను వేగవంతం చేయాలని నిర్ణయం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి


2

## రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతున్నాయని, పలు జిల్లాల్లో మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీచేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వీటితోపాటు నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది.





## మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వినూత్న నిరసన
- సీఎం పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- స్పీకర్‌గా మాణిక్‌రావు ప్రభుత్వ విధానాలపై వ్యంగ్యాస్త్రాలు
- సస్పెన్షన్లపై చురకలు
- ప్రతిపక్ష గొంతు నొక్కుతున్నారంటూ విమర్శలు

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు, అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారనే ఆరోపణలకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం

మిగతా 2వ పేజీలో..

## ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయ ఆమోదం



- అరబ్ దేశాల మధ్య విభేదాలకు తెర
- భారత్ దౌత్యంతో చివరి నిమిషంలో సయోధ్య
- యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు పెద్ద పాత్ర
- స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం
- పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్
- స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం

5

## ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ



- దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు చైనా సిద్ధం
- భారత్‌తో కలిసి నడవాలి: జిన్‌పింగ్
- ఉమ్మడి అభివృద్ధికి పరస్పర సహకారం
- నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం: మోదీ
- ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్

5




# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- **కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్**
- **హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం**
- **'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' నినాదం**
- **మండలిలో మొత్తం నాలుగు బిల్లులకు ఆమోదం**
- **ఆరు రోజుల పాటు కొనసాగిన శాసనమండలి సమావేశాలు**
- **19 గంటల 20 నిమిషాల పాటు మండలి కార్యకలాపాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది.

**ఒకే పరిపాలన.. ఒకే చట్టం**

హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం తెలిపింది.

**నాలుగు బిల్లులకు ఆమోదం**

శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు.

**ఆరు రోజులు.. 19 గంటల 20 నిమిషాలు**

తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

# మాక్ అసెంబ్లీలో తలసాని సెటైర్లు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్ర పోషించగా.. ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, మంత్రుల వ్యాఖ్యలపై తలసాని సీఎం పాత్రలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**సస్పెన్షన్లపై చురకలు**

మాక్ అసెంబ్లీలో తలసాని మాట్లాడుతూ.. "కొండా సురేఖ బిడ్డ నా గురించి మాట్లాడింది కాబట్టే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు ఉండి తొక్కి వచ్చాను. ముఖ్యమంత్రినైన నన్ను, అదీ ఓ బీసీ బిడ్డను బర్తరఫ్ చేయక ఏం చేయాలి? కేబినెట్‌లో వేరే వాళ్లు కూడా ఉన్నారుగా.. కొండా సురేఖ బిడ్డ వాళ్ల గురించి కూడా మాట్లాడొచ్చుగా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ప్రతిపక్షాల ప్రశ్నలపై వ్యంగ్యం**

బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి తలసాని మాట్లాడుతూ.. "సబితక్క, సునీతక్క అంటే నాకు ఎంతో గౌరవం. కానీ, మీరు ఇవన్నీ సభలో ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే మిమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశాను" అంటూ సటైరికల్‌గా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను లేవనెత్తకుండా ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేస్తూ మంత్రులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

**ప్రజల పక్షాన ప్రశ్నిస్తాం**

అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వ తీరును ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు.

# మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# అధికారం పోయింది.. అహంకారం పోలేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అధికారం కోల్పోయినా అహంకారం మాత్రం పోలేదంటూ ఆయన విమర్శించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం కొనసాగుతున్న సమయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**అహంకారం వదులుకోవాలంటూ**

అధికారం పోయింది.. కానీ అహంకారం పోలేదంటూ ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అహంకార ధోరణిని వీడాలని సూచించారు.

# వేలాడుతున్న విస్తరణ కత్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అదనంగా మరో పదవి ఖాళీ అయింది. దీంతో మొత్తం మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఈ పదవుల కోసం ఆశావహుల పోటీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్య డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎవరికి అవకాశం కల్పించినా మరికొందరిలో అసంతృప్తి రేగే ప్రమాదం ఉండటంతో, విస్తరణకు ముందే ఆశావహులను బుజ్జగించడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రెడ్డి వర్గం సీనియర్లకు ఆశలు**

మంత్రివర్గంలో చోటు కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రితో సహా ఇప్పటికే కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గానికి గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు స్థానాల్లోనూ అదే వర్గానికి అవకాశం కల్పిస్తే బీసీ, ఎస్టీ, లంబాడా వర్గాల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు సీనియర్ రెడ్డి నేతలను పక్కనపెడితే, వారు నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని అసమ్మతి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**ప్రాంతీయ సమీకరణాలూ కీలకమే**

ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల నేతలు పదవులను ఆశిస్తున్నారు. కొండా సురేఖ నిష్క్రమణతో బీసీ సామాజిక వర్గానికి చెందిన స్థానం ఖాళీ కావడం కూడా సామాజిక సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని పెంచింది. బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు వినిపిస్తుండగా.. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్రు నాయక్ ఆశావహులుగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు పదవుల భర్తీలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమన్వయం చేయడం అధిష్ఠానానికి సవాలుగా మారింది.

**ముందు బుజ్జగింపులపైనే దృష్టి**

రాబోయే స్థానిక సంస్థల, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. పదవులు దక్కని సీనియర్లు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తే, ఆ పరిణామం బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయ ఆయుధంగా మారవచ్చు. దీంతో తొందరపడి విస్తరణ చేపట్టి కొత్త వివాదాలకు తెరతీయడం కంటే.. ముందుగా ఆశావహులను సముదాయించడంపైనే రేవంత్ దృష్టి సారించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించడం ద్వారా అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు జరగవచ్చని భావిస్తున్నారు.

**ఆ తర్వాతే కేబినెట్ విస్తరణ**

ఆశావహుల అసంతృప్తిని కొంతమేర తగ్గించిన తర్వాతే మంత్రివర్గ విస్తరణపై ముందడుగు వేయాలని రేవంత్ భావించే అవకాశం ఉంది. హైకమాండ్ ఆమోదం లభించినా, పదవులు దక్కని నేతలను దారికి తీసుకురావడం, సామాజిక సమతుల్యతను కాపాడటం ఆయన నాయకత్వానికి పరీక్షగా నిలవనుంది. మూడు పదవుల కోసం పోటీ పడుతున్న ఆశావహులు అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తారా? లేక అసమ్మతి గళం వినిపిస్తారా? అన్నది ఇప్పుడు కాంగ్రెస్‌లో ఆసక్తికరంగా మారింది.

# ఆదిలాబాద్ విమానాశ్రయంపై మరో ముందడుగు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఆదిలాబాద్ ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో తాను శనివారం సమావేశమైనట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించామన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడంతోపాటు ఈ కార్యాచరణను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు రక్షణ శాఖ, పౌరవిమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఒక్కో నోడల్ ఆఫీసర్‌ను వచ్చే వారంలోగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దీంతోపాటు జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్(జేయూఏ)కు సంబంధించిన డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు.. వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం.. ఇవాళ తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ విషయంలో దేశ రక్షణపరంగా వ్యూహాత్మక ప్రాంతమైన ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని వివరిస్తూ రీజనల్ కనెక్టివిటీని మెరుగుపరచాల్సిన అంశాన్ని రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీనిపై స్పందించిన ఆయన ఆదిలాబాద్‌లో జేయ□ఏను అభివృద్ధి చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారన్నారు. కాగా, ఈ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయి. ఇందులో భాగంగా రక్షణ, పౌర విమానయాన అధికారులు ఏప్రిల్ 17న ఆదిలాబాద్ వియానాశ్రయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంలో 2.75 కిలోమీటర్ల రన్ వే నిర్మాణం అవసరమని నిర్ణయించారు. దీంతోపాట□ ఐఏఎఫ్ వద్ద 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్స్, ఆపరేషనల్ కాంప్లెక్స్, ట్రైనింగ్ ఫెసిలిటీస్, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రా సదుపాయాలను కల్పిస్తామన్నారు. పౌర సేవలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ఒక సివిల్ టెర్మినల్‌తోపాటు మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎమ్మార్వో) సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుంది. వీటితోపాటు ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తారు.

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

- **రూపాయి జీతంతో పేదల కోసం పనిచేస్తున్న నేనా..**
- **అసెంబ్లీకి రాకుండా ఫార్మ్ హౌస్‌లో ఉన్న కేసీఆరా**
- **పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు**
- **మాజీ మంత్రి హరీష్ రావును ప్రశ్నించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13, ఆశ్వి అప్డేట్స్ :**

ప్రతిపక్షాలు 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని నన్ను అడుగుతున్నారు.. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయొద్దా అని మంత్రి నిలదీశారు. తాను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. 'ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా' అని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రూ.21 కోట్లT పొంది అసెంబ్లీకి, ప్రజలకు మొఖం చాటేసిన కే.సీ.ఆర్ రాజీనామా చేయరా అని హరీష్ రావును ప్రశించారు.

**అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్**

'అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు' అని స్పష్టం చేశారు. తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ 'పొంగులేటి.. పొంగు' అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు.' పొంగులేటి.. పొంగు అని ఎందుకు పదేపదే అంటున్నారు.. ఎందుకు అంత భయం.. శుభకార్యంలో పాలు పొంగితే శుభం. కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంలో పొంగితే ఆ పొంగులో మీరే కాదు.. మీ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుంది' అని వ్యాఖ్యానించారు



# 22Aపై చర్చలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13, ఆశ్వి అప్డేట్స్:**

శాసనసభలో 22A నిబంధనలపై జరిగిన చర్చతో ప్రజలకు ఎలాంటి ఉపశమనం లభించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సభ సాక్షిగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని పారించారని మండిపడ్డారు. 22A అక్రమాలపై ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే తమకు మైక్ ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. తమను సభ నుంచి బయటకు పంపిన తర్వాత మంత్రి సుదీర్ఘ ప్రసంగంతో ఎదురుదాడికి దిగారే తప్ప, తాము లేవనెత్తిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేకపోయారని అన్నారు.

**సభను పక్కదోవ పట్టించారు..**

**క్షమాపణ చెప్పలేదు**

22A జాబితా కారణంగా రాష్ట్రంలో ఎన్ని లక్షల మంది ప్రజల ఆస్తులు నిలిచిపోయాయో స్పష్టం చేయాలని తాము ప్రశ్నించినా ప్రభుత్వం సమాధానం దాటవేసిందని హరీశ్ రావు అన్నారు. అయితే, జాబితాను సక్రమంగా పరిశీలించకుండానే భూములను 22Aలో చేర్చామని మంత్రి చెప్పడం ద్వారా తప్పు జరిగిన విషయాన్ని సభలోనే అంగీకరించారని గుర్తు చేశారు. పొరపాటు జరిగిందని ఒప్పుకున్న మంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పకపోగా తమపై ఎదురుదాడి చేయడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి ఇంటిని మాత్రం రాత్రికి రాత్రే 22A నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని, ఇదేనా ప్రజా ప్రభుత్వ పాలన అని ప్రశ్నించారు.

**మా మామ భూమిపై అవాస్తవాలు**

తమ కుటుంబ సభ్యుల భూములకు సంబంధించి మంత్రి పొంగులేటి సభలో అర్ధసత్యాలు మాట్లాడారని హరీశ్ రావు ఖండించారు. తన మామగారి భూమి గజ్వేల్ నియోజకవర్గంలో ఉంటే.. సిద్దిపేటలో ఉందంటూ మంత్రి తప్పుగా ప్రచారం చేశారని తెలిపారు. ఆ భూమికి 2010లోనే ఎన్ఓసీ వచ్చిందని, చెక్కుల ద్వారా చట్టబద్ధంగా లావాదేవీలు నిర్వహించి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని స్పష్టం చేశారు.

ఎకరా రూ.15 కోట్ల విలువ అంటూ మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. నిజంగా అంత విలువ ఉంటే ఎకరాను రూ.50 లక్షలకే ఇస్తామని, మంత్రి పొంగులేటినే వచ్చి కొనుగోలు చేయాలని సవాల్ విసిరారు.

**తెలంగాణ ఉద్యమకారులను అవమానించడమే**

తనను 'అగ్గిపెట్టె రావు' అంటూ మంత్రి పొంగులేటి సంబోధించడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటికి తెలంగాణ ఉద్యమ చరిత్ర, దాని తీవ్రత ఏమాత్రం తెలియదని విమర్శించారు. తాము ఉద్యమం చేసిన రోజుల్లో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనే ఉద్దేశంతో పోరాటాలు చేయలేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో భాగస్వాములైన వారిని, ఉద్యమకారులను ఇలాంటి వ్యాఖ్యలతో సంబోధించడం తెలంగాణ సమాజాన్ని, ఉద్యమ పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని హరీశ్ రావు ధ్వజమెత్తారు.

# మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలపై శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని, మీ సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నానని చెప్పారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలను స్థానిక కమిషనరేట్‌కు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని ఆయన చెప్పారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకుని పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలన్నారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని కోరారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్సవ సమితులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, జీహెచఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు, హైడ్రా కమిషనర్, పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో తీవ్ర అన్యాయం

- **మంత్రి సమాధానం తప్పుదారి పట్టించేలా ఉంది**
- **100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి కేవలం 33 మందినే నియమించారు**
- **70 పోస్టులను జనరల్ కేటగిరీకి మార్చడంపై ఎమ్మెల్సీ పోచంపల్లి ఆగ్రహం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

డీఎస్సీ (2024) ఉపాధ్యాయ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా కింద ఉపాధ్యాయుల నియామకాపై మరోసారి తీవ్ర దుమారం రేగింది. ఈ అంశంపై శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అడిగిన ప్రశ్నకు క్రీడా శాఖ మంత్రి శ్రీహరి ఇచ్చిన సమాధానం తప్పుదారి పట్టించేలా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలు తన దృష్టికి రాలేదంటూ మంత్రి తప్పించుకునే యత్నం చేయడంపై జాతీయ క్రీడాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో చేపట్టిన స్పోర్ట్స్ కోటాలో టీచర్ల నియామకల్లో తప్పులు దొర్లాయని, వాటిని సరి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. క్రీడాకారుల కోసం ఎంతో చేస్తున్నామని, అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. బయట చెప్పేది ఒకటి.. ఆచరణలో మరొకటి చేస్తోందని శ్రీనివాస రెడ్డి విమర్శించారు. 2024 డీఎస్సీ టీచర్ నియామకాల్లో స్పోర్ట్స్ కోటాలో 100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కేవలం 33 పోస్టులను మాత్రమే భర్తీ చేసి మిగిలిన పోస్టులను జనరల్‌కు మార్చారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జాతీయ క్రీడాకారులకు జరిగిన అన్యాయంపై ఆయన ప్రశ్నించారు. చాలామంది జాతీయ స్థాయి క్రీడాకారులకు ఉద్యోగాలు రాకుండా అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లినవారికి ఇప్పటి వరకు న్యాయం చేయలేదని, కనీసం కోర్టుకు



కూడా ప్రభుత్వం తరుపున కౌంటర్ అఫిడవిట్ ఇవ్వకపోవడం వల్ల జాతీయ క్రీడాకారులకు ఉద్యోగాలు రాకుండా పోతున్నాయని తెలిపారు. జనరల్‌కు మార్చిన 70 పోస్టులను మళ్లీ స్పోర్ట్స్ కోటాలో నియమకాలు చేయాలని సభ దృష్టికి తీసుకొస్తే, క్రీడా శాఖ మంత్రి ఈ విషయం తన దృష్టికి రాలేదని ఎవరూ తనను కలిసి చెప్పలేదని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై రీ వెరిఫికేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారని జాతీయ క్రీడాకారులందరూ 2025 సెప్టెంబర్‌లో క్రీడా శాఖ మంత్రిని కలిసి ఒక వినతిపత్రం ఇచ్చారు. రీవెరిఫికేషన్ త్వరగా పూర్తి చేసేందుకు అధికారులతో మాట్లాడుతానని క్రీడామంత్రి హామీ ఇచ్చారని బాధితులు చెబుతున్నారు. కానీ ఆ తర్వాత ఎన్నిసార్లు కలిసినా పరిశీలనలో ఉందంటూ దాటవేస్తున్నారని, ఇప్పటివరకు రీవెరిఫికేషన్ కు సంబంధించిన వివరాలను వెల్లడించకపోవడం వల్ల తమకు ఉద్యోగాలు రావడంలేదని జాతీయ క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. పోచంపల్లి అడిగిన ప్రశ్నకు తప్పుదారి పట్టించేలా క్రీడ శాఖ మంత్రి కనీసం తమ దృష్టికి రాలేదని చెప్పడం సరికాదన్నారు. ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చిన ఫోటోలను బాధితులు మీడియాకు చూపించారు. ఇదే అంశంపై స్పోర్ట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ గత ఆగస్టులో క్రీడాశాఖకు పంపిన లేఖను సైతం అభ్యర్థులు చూపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాతీయ స్థాయి క్రీడాకారులు వేడుకుంటున్నారు.

# 'రీయింబర్స్‌మెంట్'పై దాటవేత తగదు

- **రూ.15 వేల కోట్ల బకాయిల విడుదల ఎప్పుడో ప్రకటించాలి**
- **జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థను నాశనం చేస్తున్నారు**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై కాలయాపన చేయకుండా స్పష్టమైన ప్రకటన చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో బీజేపీ ఎందుకు ప్రశ్నించలేదని అనడం పూర్తి అవాస్తవమన్నారు. 2017 జనవరి 4న తాను శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడే ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, విద్యావ్యవస్థ దుస్థితిపై గళమెత్తిన అంశాలు అసెంబ్లీ, మండలి రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు.

**రూ.15 వేల కోట్లకు చేరిన బకాయిలు**

రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తెలంగాణ వచ్చిన తర్వాత కూడా బకాయిల సమస్య కొనసాగుతూనే ఉందని రామచందర్ రావు పేర్కొన్నారు. బీఆరఎస్ తన పదేళ్ల పాలనలో మొదటి ఎనిమిదేళ్లు నిధులు ఇచ్చి చివరి రెండేళ్లలో దాదాపు రూ.5 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసెంబ్లీలోనే బీఆరఎస్ నుంచి రూ.5,430 కోట్ల బకాయిలు వచ్చాయని చెప్పిందని, 202425 నాటికి కాంగ్రెస్ హయాంలోనే మరో రూ.6,037 కోట్ల బకాయిలు పెరిగాయని ప్రభుత్వమే వెల్లడించిందని వివరించారు. 2026 నాటికి పాత, కొత్త బకాయిలు అన్నీ కలిసి సుమారు రూ.15 వేల కోట్లకు చేరుకున్నాయని మండిపడ్డారు. విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నగదు జమ చేసే డీబీటీ విధానానికి బీజేపీ ఏనాడూ వ్యతిరేకం కాదని, యాజమాన్యాలతో తమకు సంబంధం లేదని, విద్యార్థుల ఖాతాల్లో ఆ సొమ్మును ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. బకాయిలు చెల్లించకపోవడం వల్లే అనేక కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆరఎస్ హయాంలో అక్రమాలు జరిగినా, కాంగ్రెస్ హయాంలో జరిగినా సమగ్ర విచారణ జరపాలని, విజిలెన్స్ దాడుల పేరుతో కాలేజీలను వేధించడం సరికాదని స్పష్టం చేశారు.

**విద్యాశాఖ నిర్వీర్యం.. పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జి దుర్మార్గం**

సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని విద్యావ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. నూతన విద్యావిధానం తీసుకొస్తామని చెప్పి నియమించిన కమిటీ చైర్మనే రాజీనామా చేశారని, ఆ కమిటీ విద్యా సంస్కరణల కోసం కాక నక్సలిజం భావజాలం, నక్సలైట్లను తయారు చేసే దిశగా మారిందని మండిపడ్డారు. మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలను సర్కార్ అంధకారంలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 97 ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ఇంటిగ్రేట్ చేసి పాలిటెక్నిక్ డిగ్రీనే పూర్తిగా ఎత్తేసే కుట్ర జరుగుతోందని, వారికి ఈసెట్ రాసే అర్హత ఉంటుందో లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై క్రూరంగా లాఠీచార్జి చేయించడం అమానుషమన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ 'చాత్రోం కీ గూంజ' అని ఉపన్యాసాలు ఇస్తుంటే తెలంగాణలో మాత్రం లాఠీలతో విద్యార్థులను బాదుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీకి ఇక్కడి పరిస్థితులు తెలియజేస్తూ ఇంగ్లీషుతోపాటు ఆయనకు అర్థమయ్యేలా ఇటాలియన్ భాషలో కూడా లేఖ రాశామని, అందుకే ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి



తప్పనిసరి పరిస్థితుల్లో నోరు మెదపాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

**లక్షలాది విద్యార్థుల తరపున బీజేపీ పోరాటం**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కార్యకర్తలు కాలేజీలకు వెళ్లి సుమారు ఎనిమిది లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారని స్పష్టం చేశారు. ఆ వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందించేందుకు సమయం కోరితే కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి ఉన్న బాధ్యతారాహిత్యానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. తాను ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 48 గంటల నిరాహార దీక్ష చేశానని, సెక్రటేరియట్ వద్దకు వెళ్లిన బీజేపీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేసి, కేసులు పెట్టి తీవ్రంగా కొట్టడంతో చాలామంది హాస్పిటల్ పాలయ్యారని గుర్తుచేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో డీప్‌టెక్ దశాబ్దానికి పాన్‌ఐఐటీ సమ్మిట్–2026

- **ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటమ్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి**
- **స్వర్ణాంధ్ర–2047, వికసిత్ భారత్–2047 లక్ష్యాల సాధనకు సాంకేతికత–పెట్టుబడుల అనుసంధానం**

**విజయవాడ, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్, సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, ఏరోస్పేస్, డిఫెన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పాన్‌ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్-2026 నిర్వహించనున్నారు. 'Andhra's DeepTech Decade: Anchored by PanIIT - Swarnandhra to Viksit Bharat 2047' అనే ఇతివృత్తంతో అక్టోబర్ 3న విజయవాడలోని డా. బి.ఆర్. అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు జరగనుంది. పాన్‌ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో




జరిగే ఈ సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. దేశంలోని వివిధ ఐఐటీల డైరెక్టర్లు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రముఖులు, విధాన నిర్ణేతలు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, టెక్నాలజీ నిపుణులు సదస్సుకు హాజరుకానున్నారు.

**డీప్‌టెక్ నుంచి AI ఆధారిత పాలన వరకు**

ఏఐ, డీప్‌టెక్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, డిఫెన్స్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ, మెడ్‌టెక్, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్లింగ్, ఏఐ ఆధారిత పాలన వంటి అంశాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి. పరిశోధన, పెట్టుబడులు, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా రాష్ట్ర యువతకు కొత్త ఉపాధి, పారిశ్రామిక అవకాశాలు కల్పించే మార్గాలపైనా దృష్టి సారించనున్నారు.

**ప్రభుత్వం–పరిశ్రమ–ఐఐటీల భాగస్వామ్యం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాన్‌ఐఐటీ, దేశంలోని ఐఐటీలు, పరిశ్రమల మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యానికి సదస్సు వేదిక కానుంది. ప్రతిపాదిత PanIIT Amaravati Council, DeepTech పెట్టుబడులకు ప్రత్యేక యంత్రాంగాలు, Global IIT Mentor Network వంటి అంశాలను కూడా పరిశీలించనున్నారు. పాన్‌ఐఐటీ అలుమ్ని ఇండియా చైర్మన్ ప్రబాత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పారిశ్రామికవేత్తలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం సమ్మిట్ ప్రత్యేకత అన్నారు. ఐఐటీ అలుమ్ని సమాజం స్వర్ణాంధ్ర-2047, వికసిత్ భారత్-2047 లక్ష్యాల సాధనలో ఉత్ప్రేరక శక్తిగా పనిచేయగలదని పేర్కొన్నారు. పాన్‌ఐఐటీ అలుమ్ని ఇండియా వైస్ చైర్మన్ డా. అమితాబ్ రంజన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సముద్ర తీరం, ఖనిజ వనరులు, మెరుగైన కనెక్టివిటీ, ప్రతిభావంతమైన మానవ వనరులు రాష్ట్రాన్ని ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనుకూలమని తెలిపారు. సమ్మిట్ చైర్ స్వదీప్ పిళ్లరిశెట్టి మాట్లాడుతూ దేశంలోని 23 ఐఐటీల ప్రతిభ, సాంకేతికత, పెట్టుబడులు, నైపుణ్యాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ డీప్‌టెక్ దశాబ్దానికి పునాది వేయడమే లక్ష్యమన్నారు. చర్చలను కార్యాచరణాత్మక భాగస్వామ్యాలుగా మార్చి రాష్ట్రంలో దీర్ఘకాలిక టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే సమ్మిట్ ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## నిమ్స్ వైద్యులకు
# సీఎం అభినందనలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

నిమ్స్‌లో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ క్యాంప్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా వైద్యులు డి.రమణ ధన్నపునేని, ఎం.అమరేష్ రావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 6 నుంచి 12 వ తేదీ వరకు క్యాంపును నిర్వహించగా పుట్టుకతో గుండె జబ్బులతో బాధపడుతున్న 19మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు చేశారు. ఇందులో కేవలం రెండు కిలోల బరువున్న రెండు నెలల పసికందుకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలకు నిరసన

- **తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**

**మహేశ్వరం, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారీ ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఉందని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి తప్ప వ్యక్తిగతంగా అవమానించే స్థాయికి వెళ్లకూడదని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తెలంగాణ విమోచన జైత్రయాత్రకు విశేష స్పందన

- **వేలాది బైక్‌లతో బాలాపూర్ నుంచి చార్మినార్ వరకు భారీ ర్యాలీ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన జైత్రయాత్రకు విశేష స్పందన లభించింది. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు నేతృత్వంలో బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి ఆలయం వరకు వేలాది బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలను చేతబూని, దేశభక్తి నినాదాలతో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. దేశ ఐక్యత, జాతీయ సమైక్యత, సంఘటిత శక్తిని చాటిచెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ విమోచన పోరాట చరిత్రను నేటి యువత, భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో జైత్రయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని ప్రజలకు గుర్తుచేయడంతో పాటు విమోచన దినోత్సవ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ గంగాపురం వెంకటరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, బీజేవైఎం నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జైత్రయాత్రను విజయవంతం చేశారు.

# డీకే శివకుమార్‌ను కలిసిన మధుయాష్కి గౌడ్

- **ఏఐపీసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన సందర్భంగా అభినందనలు**

**బెంగళూరు, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (AIPC) చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యుడు మధుయాష్కి గౌడ్ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్‌కు డీకే శివకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఏఐపీసీ చైర్‌పర్సన్‌గా కొత్త బాధ్యతలు చేపట్టిన మధుయాష్కి గౌడ్ తనను కలవడం పట్ల సీఎం శివకుమార్ అభినందనలు తెలిపారు.

ఈ భేటీలో ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ కార్యకలాపాలు, సంస్థ భవిష్యత్ కార్యక్రమాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.





## కక్షతో దూరం పెంచుకోవద్దు.. రాజీతో బంధాలను కాపాడుకోవాలి

- **కేసులతో కాలం, డబ్బు వృథా చేయొద్దు.. లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం**
- **2,020 కేసులకు పరిష్కారం**

**గజ్వేల్, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

కక్షలు, వివాదాలతో బంధాలను దూరం చేసుకోకుండా రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్ సూచించారు. కేసుల పరిష్కారానికి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గజ్వేల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు వివాదాలకు సామరస్య పూర్వక పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దీనివల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడతాయని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో వివిధ రకాల 2,020 కేసులకు పరిష్కారం లభించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. కుటుంబ, వ్యక్తిగత వివాదాలను కక్ష సాధింపుతో కొనసాగించకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడం ద్వారా ప్రశాంతమైన జీవితం గడపవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ మాధవీలత, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. కిరణ్ సాగర్‌రావు, ఉపాధ్యక్షుడు నరేష్‌చారి, గజ్వేల్ సీఐ రవికుమార్, తొగుట సీఐ లతీఫ్, పలు పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



## అప్పంపల్లి అమరవీరులకు అంజలి

- **తెలంగాణ విమోచన వారోత్సవాల్లో అమరవీరుల పోరాటం స్మరణ**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలోని అమరవీరుల స్థూపానికి శనివారం బీజేపీ నాయకులు నివాళులర్పించారు. రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. 1947 అక్టోబర్ 7న బెల్లం నాగన్న నాయకత్వంలో రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 11 మంది ప్రాణాలు కోల్పోయారని నాయకులు తెలిపారు. అప్పటి పోరాటానికి గుర్తుగా నిలిచిన రావి చెట్టు అమరవీరుల వీరగాథకు సాక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాలేదని, అనంతరం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన పోలీసు చర్య అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని నాయకులు వివరించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలపై బీజేపీ నాయకులు విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.



## రేవల్లిలో కాంగ్రెస్ నిరసన

- **బీఆర్ఎస్ తీరుపై దళిత సంఘాలు, కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితుల నిరసన అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం రేవల్లి మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంబీ సుల్తాన్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు బీఆర్ఎస్ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

దళితులు నిరసన తెలిపిన అనంతరం ఫామ్‌హౌస్ మైలపడిందన్న భావనతో పసుపు నీళ్లు చల్లడం దళిత సమాజాన్ని అవమానించడమేనని నాయకులు ఆరోపించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి పదవులు అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు అదే వర్గాన్ని కించపరిచేలా వ్యవహరించడం సరికాదన్నారు.

కేసీఆర్ హయాంలో దళితులకు ఇచ్చిన పలు హామీలు అమలు కాలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. తొలి దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళిత బంధు వంటి హామీల విషయంలో దళితులను మోసం చేశారని ఆరోపించారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరించిన బీఆర్ఎస్‌కు ప్రజలు రాబోయే రోజుల్లో తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పర్వతాలు, ఉపాధ్యక్షుడు బండారు శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాములు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రేవతి సురేష్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు కురుమయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తిరుపాతయ్య, సిరిమల్లేష్‌తో పాటు పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య మౌలిక వసతులకు మరింత బలం

- **10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ల ప్రారంభం**

**విజయవాడ, ఆశ్వి అప్డేట్స్:**

ఆంధ్రప్రదేశ్‌లో అత్యవసర వైద్య సేవలు, వ్యాధుల ముందస్తు నిర్ధారణ, వ్యాధి పర్యవేక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. పీఎంఏబీహెచ్ఐఎం (PMABHIM) పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విజయవాడలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 24 క్రిటికల్ కేర్ బ్లాకులు, 26 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందుకోసం రూ.647.51 కోట్ల నిధులు కేటాయించిందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మౌలిక వసతులు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రజారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు దోహదపడనున్నాయి. ఇదే సందర్భంగా అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా అందిస్తున్న సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అభినందించింది. ఈ కార్యక్రమానికి సంబంధించి సాంకేతిక



బృందాన్ని రాష్ట్రానికి పంపేందుకు కేంద్రం సహకరిస్తోందని పేర్కొంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 'సంజీవని హెల్త్' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

# ఎడబాటుకు తెర.. లోక్ అదాలత్‌తో దంపతులు రాజీ

- **13 ఏళ్లుగా వేర్వేరుగా జీవనం.. లోక్ అదాలత్ చొరవతో కుటుంబ వివాదానికి సామరస్య పరిష్కారం**

**గజ్వేల్, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**



పదమూడేళ్లుగా వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తలు లోక్ అదాలత్ చొరవతో తమ మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకుని తిరిగి కలిసేందుకు అంగీకరించారు. దీంతో ఇన్నేళ్లుగా కొనసాగుతున్న కుటుంబ వివాదానికి సామరస్యపూర్వకంగా ముగింపు లభించింది.

అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అండె లక్ష్మికి తొగుట మండలం లింగంపేటకు చెందిన అండె ఆంజనేయులుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో తన తల్లిదండ్రులు నగదు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు గృహోపకరణాలు అందజేసినట్లు లక్ష్మి పేర్కొంది. కొంతకాలం దంపతుల సంసారం సజావుగానే సాగిందని, వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని తెలిపింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను శారీరకంగా, మానసికంగా వేధించారని లక్ష్మి గతంలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కుటుంబ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని, చివరకు తాను ఇంటి నుంచి బయటకు వచ్చానని ఆమె పేర్కొంది. ఈ నేపథ్యంలో 2013 మే 14న గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో లక్ష్మి ఫిర్యాదు చేయగా, అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా జీవిస్తున్నట్లు తెలిసింది.

**లోక్ అదాలత్ చొరవతో పరిష్కారం**

పదమూడేళ్ల అనంతరం ఈ కేసు లోక్ అదాలత్ పరిధిలోకి రావడంతో ఇరువర్గాలతో చర్చలు నిర్వహించారు. కుటుంబ సమస్యను కోర్టు వెలుపల సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పెద్దల సమక్షంలో జరిగిన చర్చల అనంతరం భార్యాభర్తలు తమ మధ్య ఉన్న విభేదాలను రాజీ ద్వారా పరిష్కరించుకుని కలిసి జీవించేందుకు అంగీకరించారు. దీంతో 13 ఏళ్లుగా కొనసాగిన ఎడబాటుకు తెరపడటంతో ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ న్యాయస్థాన ప్రథమ శ్రేణి న్యాయాధికారి స్వాతి గౌడ్, ఏపీపీ మాధవీలత, గజ్వేల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, న్యాయవాది అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కుటుంబ వివాదం సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

# జాతీయ లోక్ అదాలత్ ఘన విజయం

- **ఒకే రోజు 203 కేసుల పరిష్కారం.. రూ.82.09 లక్షల రికవరీ**
- **మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవితాదేవి**

**జహీరాబాద్, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పరిష్కరించగా, ఒకే రోజు 203 కేసులకు ముగింపు లభించింది. ఈ కేసుల ద్వారా మొత్తం రూ.82,09,327 రికవరీ సాధించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవితాదేవి తెలిపారు.

సీనియర్ కోర్టు విభాగంలో అత్యధికంగా రూ.70,85,227 వసూలయ్యాయి. ఇందులో 3 సివిల్ కేసులు, 83 బ్యాంకు పీఎల్‌సీ కేసులు, 10 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించారు.

అడిషనల్ కోర్టు విభాగంలో రూ.10,34,100 వసూలు కాగా, 49 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 19 అడ్మిషన్ కేసులు, 13 ఎక్సైజ్ కేసులు, ఒక క్రిమినల్ మెయింటెనెన్స్ కేసును పరిష్కరించారు.

ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు విభాగంలో రూ.90 వేల రికవరీ జరిగింది. ఇందులో 6 సివిల్ కేసులు, 13 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 6 అడ్మిషన్ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా కవితాదేవి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ప్రజలకు అందుబాటులో ఉన్న సులభమైన న్యాయ పరిష్కార వేదిక అని పేర్కొన్నారు. ఇరువర్గాల సమ్మతితో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టుల చుట్టూ తిరిగే సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. ప్రజలు లోక్ అదాలత్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.








# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- **నిర్వాహకులకు పోలీసుల అవగాహన.. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: డీఎస్పీ శివరాం రెడ్డి**

**నల్గొండ, సెప్టెంబర్ 12 (ఆశ్వి అప్డేట్స్):**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాల సమయంలో పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని, ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరస్పర సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్గొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ ఆదిరెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐలు జి. ముత్తయ్య, జె. సైదులు, టూటౌన్ ఎస్ఐ సైదాబాబు, రూరల్ ఎస్ఐ శివప్రసాద్, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్యే సంక్షేమానికి కీలకం

- **విద్యతోపాటు క్రీడలు, క్రమశిక్షణకు ప్రాధాన్యం**
- **మాదకద్రవ్యాలకు దూరంగా బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: డీజీపీ సి.వి. ఆనంద్**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం పోలీసు సంక్షేమంలో కీలక భాగమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. పిల్లల భవిష్యత్తుపై భరోసా కల్పిస్తే పోలీసులు తమ విధులపై మరింత ఏకాగ్రతతో పనిచేయగలరని పేర్కొన్నారు. మంచిరేవులలోని ఆక్టోపస్-గ్రేహౌండ్స్ ప్రాంగణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్-1 నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు.

**జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2024 డిసెంబరులో పోలీసు సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు డీజీపీ తెలిపారు. ఆర్మీ, సైనిక్ స్కూళ్ల తరహాలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో వైఐపీఎస్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది తాత్కాలిక ప్రాంగణంలో 120 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం సుమారు 360 మంది విద్యార్థులు ఉన్నారని, కొత్త భవనం పూర్తయితే వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య 700-720కు చేరే అవకాశం ఉందన్నారు.



**చదువుతోపాటు క్రీడలు, క్రమశిక్షణ**

విద్యార్థుల్లో చదువుతోపాటు క్రమశిక్షణ, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డీజీపీ చెప్పారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. క్రికెట్‌తోపాటు రాక్ క్లైంబింగ్, గుర్రపు స్వారీ వంటి సాహస క్రీడల్లోనూ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

**హోంగార్డుల పిల్లలకు, సాధారణ విద్యార్థులకూ అవకాశం**

పోలీసు సిబ్బందితోపాటు హోంగార్డుల పిల్లలకు కూడా పాఠశాలలో ప్రవేశ అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాఠశాలలో 50 శాతం సీట్లను సాధారణ విద్యార్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

**ప్లస్–2 వరకు ఒకే ప్రాంగణంలో విద్య**

ప్రభుత్వ సహకారంతో వైఐపీఎస్‌ను ఒకే ప్రాంగణంలో ప్లస్-2 వరకు విద్య అందించే పూర్తిస్థాయి పాఠశాలగా అభివృద్ధి చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో అత్యున్నత ప్రమాణాలతో విద్యాసంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసుల సంక్షేమమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది అని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. పోలీసు కుటుంబాలకు పిల్లల విద్యపై భరోసా కల్పించడం ద్వారా విధి నిర్వహణలో పోలీసుల ఏకాగ్రతను మరింత పెంచవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, వైఐపీఎస్ ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ఏడేళ్ల తర్వాత భారత్ కు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్ :**

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్ కు చేరుకున్నారు. 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు శనివారం న్యూఢిల్లీ కి వచ్చిన ఆయన.. దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్ లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, జిన్పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనుంది. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఇరు దేశాల సంబంధాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉంది. జిన్ పింగ్ తోపాటు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ కై కీ, పొలిట్ బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ వచ్చారు. ఈ విషయాన్ని చైనాలో భారత రాయబారి షూ ఫెయిహోంగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణల తర్వాత భారత్‌చైనా సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి కీలకమని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో జిన్ పింగ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల బిష్కెక్లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్ పింగ్ స్వల్పంగా మాట్లాడుకున్నారు.



## సముద్రం వెనక్కి వెళ్లింది..
# సునామీ కాదు

- **అర్జెంటీనా తీరంలో 23 కిలోమీటర్ల మేర తగ్గిన నీరు**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా ప్రకృతి విపత్తు ప్రచారం**
- **వాతావరణ మార్పులతో తాత్కాలిక పరిణామం**
- **బలమైన గాలులతో తీరానికి దూరంగా వెళ్లిన నీరు**
- **సునామీ వస్తుందన్న భయాలు వద్దంటున్న శాస్త్రవేత్తలు**

**బ్యూనస్ ఎయిర్స్, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

అర్జెంటీనా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం రాత్రికి రాత్రే వెనక్కి వెళ్లిపోయిందంటూ వైరల్ అయిన వీడియోలు తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. సముద్రం ఏకంగా 23 కిలోమీటర్ల మేర వెనక్కి వెళ్లిందని ప్రచారం జరగడంతో భారీ ప్రకృతి విపత్తుకు ఇది సంకేతమంటూ సోషల్ మీడియాలో చర్చ సాగింది. అయితే ఈ పరిణామం వెనుక ఎలాంటి ప్రకృతి విపత్తు హెచ్చరిక లేదని అర్జెంటీనా తీర ప్రాంత శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**మళ్లీ యథాస్థితికి**

బ్యూనస్ ఎయిర్స్ ప్రావిన్సులోని మార్ డెల్ ప్లాటా తీరంలో సముద్రమట్టం భారీగా తగ్గడం వాస్తవమేనని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే కొంత సమయం తర్వాత సముద్రం తిరిగి సాధారణ స్థితికి చేరుకుందని వివరించారు. వాతావరణ పరిస్థితుల్లో తాత్కాలిక మార్పులు, సముద్రపు ఆటుపోట్ల చక్రంలో భాగంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

**బలమైన గాలులతో నీరు వెనక్కి**

నిరంతరంగా వీచే బలమైన గాలుల ప్రభావంతో సముద్రపు నీరు తీరానికి దూరంగా నెట్టబడుతుందని అధ్యయనకారులు వివరించారు. దీని వల్ల సముద్రం వెనక్కి వెళ్లినట్లుగా కనిపిస్తుందని, దీనిని 'విండ్ సెట్‌డౌన్' లేదా 'లో టైడ్ సైకిల్'గా పిలుస్తారని తెలిపారు. ఉప్పెన, తుపాను సమయంలో కనిపించే పరిణామాలకు ఇది పూర్తి భిన్నమని స్పష్టం చేశారు.

**సునామీ భయం వద్దు**

సముద్రం వెనక్కి వెళ్లడాన్ని సునామీకి సంకేతంగా భావించాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. సముద్రగర్భంలో భారీ భూకంపాలు సంభవించినప్పుడు సముద్రపు నీటిలో భారీ మార్పులు చోటుచేసుకుని సునామీ.

# తక్షణమే యూఎన్ఎస్సీ సంస్కరణలు

- **ఆలస్యం ఇక ఎంతమాత్రం వద్దు: మోదీ**
- **నిబంధనలు పాటించేవారిగా కాదు.. రూపొందించేవారిగా మారాలి**
- **గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం దక్కాలి**
- **అధికార పిరమిడ్‌ను మార్చాలి**
- **ఏఐ, సైబర్, బయోటెక్‌లో సహకారం పెంచాలి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ)లో తక్షణమే సంస్కరణలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో ఇక ఎలాంటి జాప్యానికీ తావులేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించిన మోదీ.. గ్లోబల్ సౌత్ దేశాలు ఇతరులు రూపొందించిన నిబంధనలను పాటించేవారిగా కాకుండా, ప్రపంచ నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సంఘర్షణలకు ఉమ్మడి పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత బ్రిక్స్‌పై ఉందన్నారు. ఈ చారిత్రక మార్పుకు నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

**నిర్ణయాధికారం కొన్ని దేశాలకే ఎందుకు?**

బ్రిక్స్ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో ప్రపంచ వేదికపై కూటమి ప్రత్యేక స్థానం సంపాదించిందని మోదీ తెలిపారు. కష్టకాలంలో ఉమ్మడి బాధ్యత తీసుకుంటూ, పరస్పర సహకారంతో సభ్యదేశాల ప్రజలకు మరింత అభివృద్ధిపై భరోసా కల్పించాలన్నారు. ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉంటున్నప్పటికీ.. అంతర్జాతీయ నిర్ణయాలు తీసుకునే సమయంలో మాత్రం వెనుకబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పాలనా వ్యవస్థ పిరమిడ్ ఆకారంలో ఉందని, అధికారం కొద్దిపాటి దేశాల వద్దే కేంద్రీకృతమైందని విమర్శించారు. కింది స్థాయిలో ఉన్న దేశాలు నిర్ణయాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయే తప్ప.. వాటిని ప్రభావితం చేయలేకపోతున్నాయని పేర్కొన్నారు.



**సమాన హక్కులతో భాగస్వామ్య వేదిక**

అధికార పిరమిడ్ వ్యవస్థకు ముగింపు పలికి ప్రతి దేశానికి సమాన హక్కులు, స్పష్టమైన ప్రాతినిధ్యం కల్పించే భాగస్వామ్య వ్యవస్థను తీసుకురావాలని మోదీ సూచించారు. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రపంచ పాలనా వ్యవస్థలో సమగ్ర సంస్కరణల కోసం సభ్యదేశాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే ప్రతి అడుగులో మానవాభివృద్ధే కేంద్ర బిందువుగా ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ, సైబర్‌స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో మోదీ–జిన్‌పింగ్ భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13, ఆశ్వి అప్డేట్స్:**

బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత మండపంలో జరిగిన ఈ సమావేశంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కొనసాగిస్తామని జిన్‌పింగ్ తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద దేశాలైన భారత్, చైనాలు కలిసి పనిచేస్తూ పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు.

**మోదీని కలవడం ఆనందంగా ఉంది**

ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక దృష్టితో ముందుకు తీసుకెళ్లడం వల్లే భారత్-చైనా సంబంధాలు పురోగమించాయని జిన్‌పింగ్ అన్నారు. ఇరు దేశాలు భిన్నమైనవే అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధి కోసం పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయని తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు హాజరుకావడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం ఆనందంగా ఉందన్నారు. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతం కావడంపై మోదీకి అభినందనలు తెలిపారు.



**ఇరుదేశాలు ఉమ్మడిగా అభివృద్ధి చెందాలి**

గత 12 ఏళ్లలో ఢిల్లీకి రావడం తనకు ఇది రెండోసారని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ఈ కాలంలో మోదీని 21 సార్లు కలిశానని తెలిపారు. ఈ సమావేశాల ద్వారా ఇరు దేశాల మధ్య అనేక అంశాల్లో ఏకాభిప్రాయాలు కుదిరాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో కీలక సభ్యులుగా భారత్, చైనాలకు మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ ఉమ్మడి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన సహకారాన్ని కొనసాగిస్తూ సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ కోసం కలిసి పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వేగంగా పురోగతి సాధించాలని అన్నారు.

**నిర్మాణాత్మక చర్చలకు భారత్ సిద్ధం**

జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం మోదీ మాట్లాడుతూ బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం లభించిందన్నారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్ చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

**ఏడేళ్ల తర్వాత భారత్‌కు జిన్‌పింగ్**

2019లో చివరిసారిగా భారత్‌లో పర్యటించిన జిన్‌పింగ్.. ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ దేశానికి వచ్చారు. అంతకుముందు 2014, 2016లో ఆయన భారత్‌లో పర్యటించారు. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. తాజాగా బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఆయన ఢిల్లీకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయ ఆమోదం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12, ఆశ్వి అప్డేట్స్:**

బ్రిక్స్ సభ్యదేశాల ఆమోదంతో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకాభిప్రాయం లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రకటించారు. భారత్ దౌత్య ప్రయత్నాల ఫలితంగా పశ్చిమాసియా సంక్షోభంపై విభేదాలు ఉన్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సైతం ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలిపాయి. ప్రారంభంలో ఇరాన్, యూఏఈలు కఠిన వైఖరి అవలంభించడంతో చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. బ్రిక్స్ ఏకాభిప్రాయంతో పనిచేసే కూటమి కావడంతో ఏ ఒక్క దేశం వ్యతిరేకించినా ప్రకటన నిలిచిపోయే పరిస్థితి ఉండేది. వరుసగా జరిగిన తెరవెనుక చర్చలతో ప్రతిష్టంభన తొలగి, సభ్యదేశాలన్నీ సంయుక్త ప్రకటనకు ఆమోదం తెలిపాయి.

**పాత వ్యవస్థలు ఇక పనికిరావు**

సదస్సు ముగింపు ప్రసంగంలో మోదీ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచాన్ని పాతబడిపోయిన వ్యవస్థలు నడపలేవని అన్నారు. ప్రాతినిధ్యం, స్పందన, నిబంధనల రూపకల్పనలో సంస్కరణలు అవసరమని స్పష్టం చేశారు. భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వాటి నియంత్రణకు సంబంధించిన నిబంధనల రూపకల్పనలో గ్లోబల్ సౌత్ దేశాలకు సమాన భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. నిర్ణయాలు, వాటి ఫలితాల మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, ఉమ్మడి కార్యాచరణతోనే పూడ్చగలమన్నారు. ఢిల్లీ డిక్లరేషన్ ఉమ్మడి సంకల్పానికి దిశానిర్దేశం చేస్తుందని, తీర్మానాలను ఆచరణాత్మక ఫలితాలుగా మార్చాల్సిన బాధ్యత సభ్యదేశాలపై ఉందని తెలిపారు.




**యూఎన్ భద్రతా మండలిలో భారత్‌కు మద్దతు**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించింది. భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్‌కు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్యదేశాలైన చైనా, రష్యాలు మద్దతు పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలని బ్రిక్స్ కోరింది.

**స్థానిక కరెన్సీలతో వాణిజ్యానికి ప్రాధాన్యం**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచాలని డిక్లరేషన్ పేర్కొంది. సరిహద్దు చెల్లింపులకు ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని సూచించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది.

**పహల్గాం దాడిని ఖండించిన బ్రిక్స్**

ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని బ్రిక్స్ పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులను అరికట్టాలని స్పష్టం చేసింది. ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరిని వీడాలని కోరింది. అణు కేంద్రాలపై దాడులు, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను కూడా ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులు పక్కదారి పడుతుండగా ప్రపంచ సైనిక వ్యయం పెరగడంపై విచారం వ్యక్తం చేసింది.

**శిలాజ ఇంధనాల అవసరం గుర్తింపు**

అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని డిక్లరేషన్ పేర్కొంది. అదే సమయంలో పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయాలని సభ్యదేశాలు నిర్ణయించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో మహిళలు నిర్ణయాధికారులుగా కీలక పాత్ర పోషించాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# పంచాయతీలకు ఇక ఆర్థిక స్వేచ్ఛ

- **వాటి సొంత ఆదాయం సొంత ఖాతాల్లోనే జమ**
- **చట్ట సవరణపై సర్పంచ్‌ల హర్షం**
- **మంత్రి సీతక్కకు సన్మానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12. ఆశ్వి అప్డేట్స్ :**

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన కల్పించేలా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ తీసుకొచ్చినందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ద□నసరి అనసూయ సీతక్కకు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సౌధాని భూమన్న యాదవ్ నేతృత్వంలో వందలాదిమంది సర్పంచులు, పంచాయతీరాజ్ ఛాంబర్స్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి నేతృత్వంలో వందలాదిమంది సర్పంచ్‌లు ప్రజాభవన్‌కు శనివారం తరలివచ్చి మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సొంత ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేయాల్సిన పరిస్థితి నుంచి బయటకు తీసుకొచ్చి పంచాయతీల సొంత ఖాతాల్లోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు కృషి చేసినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. ఇంతకాలం పంచాయతీలు తమ పరిధిలో సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని నేరుగా వినియోగించుకునే అవకాశం లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని సర్పంచులు తెలిపారు. గ్రామంలో అత్యవసరమైన చిన్నచిన్న పనులు చేయించుకోవడానికి కూడా నిధుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, దీనివల్ల ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తేవని పేర్కొన్నారు. చట్ట సవరణతో గ్రామ పంచాయతీలకు మరింత ఆర్థిక స్వేచ్ఛ లభిస్తుందని, స్థానికంగా సమకూరే ఆదాయాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని, ఆ దిశగా చొరవ తీసుకున్న మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చట్ట సవరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందేలా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందంటూ పంచాయతీల సొంత ఖాతాల్లో సొంత ఆదాయాన్ని జమ చేసుకునేలా అనుమతులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించాలన్నది తమ ప్రభుత్వ స్పష్టమైన విధానమని అన్నారు. 'గ్రామ పంచాయతీకి వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీ అభివృద్ధికే ఉపయోగపడాలి.. ప్రజల నుంచి వసూలు చేసిన సొంత ఆదాయం కోసం పంచాయతీలు ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండకూడదు' అని అన్నారు. ఇకపై పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకొని స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. '73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తి స్థానిక సంస్థలకు అధికారాలు, విధులు, ఆర్థిక వనరులు కల్పించడమే.. ఆ స్ఫూర్తికి అనుగుణంగా పంచాయతీలను మరింత బలోపేతం చేయాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం' అని సీతక్క అన్నారు.



పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే చట్ట సవరణకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. ఇది సర్పంచుల విజయం మాత్రమే కాదు.. ప్రతి గ్రామ ప్రజల విజయం. గ్రామ పంచాయతీ చేతికి వచ్చిన ఆర్థిక స్వేచ్ఛ చివరకు గ్రామ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలి అని అన్నారు. 'గ్రామ స్వరాజ్యం మాటల్లో కాదు.. గ్రామ పంచాయతీలకు ఆర్థిక, పరిపాలనా స్వేచ్ఛ కల్పించినప్పుడే అది నిజమైన గ్రామ స్వరాజ్యం అవుతుంది. ఆ దిశలో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది' అని ఆమె చెప్పారు.



# కల్తీల పదార్థాలను ఇలా గుర్తించండి

**ప్రస్తుతం మనం తినే ఆహారంలో ఏది నాణ్యమైందో.. ఏదీ కల్తీ చేశారో గుర్తించడం చాలా కష్టంగా మారింది. ప్రజలు తీసుకునే ఆహార పదార్థాలకు భద్రత లేకుండా పోయింది. సురక్షితమైన ఆహార పదార్థాల గురించి ప్రజలకు అవగాహన చాలా అవసరం. కాబట్టి ఈ సందర్భంగా కల్తీ ఆహారాన్ని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం.**

### అంతా కల్తీ మయం...

ఈ రోజుల్లో మార్కెట్‌లో అనేక ఆహార పదార్థాలు పండ్లు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పాలు వంటివి విపరీతంగా కల్తీ జరుగుతోంది. వివిధ రకాల రసాయనాలను ఉపయోగించి పండ్లు, కూరగాయలను పండిస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా హానికరం, వాటి నిరంతర వినియోగం వాంతులు, విరేచనాలు, కాలేయం,మూత్రపిండాలతో సహా కడుపు సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కాబట్టి ఈ సమస్యలకు దూరంగా ఉండాలంటే ఒరిజినల్ ఏవి? కల్తీవి ఏవి? అనేవి గుర్తించాలి. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం..

### పాలు

పాలను నీటితో కల్తీ చేయడమే కాకుండా, దానిని చిక్కగా చేయడానికి దాని పరిమాణాన్ని పెంచడానికి డిటర్జెంట్లు, సింథటిక్ పాలు కూడా కలుపుతారు. కాబట్టి దానిని గుర్తించడానికి, 1/2 కప్పు పాలను 1/2 కప్పు నీటితో కలపండి. అందులో నురుగు వస్తే అది డిటర్జెంట్ కలిపిన పాలు అని గుర్తించాలి. సింథటిక్ పాలను గుర్తించడానికి, పాలను వేళ్ల మధ్య రుద్దినప్పుడు, అది సబ్బులా అనిపిస్తుంది.

### పసుపు

ఒక గ్లాసు నీరు తీసుకోండి. నీటిలో కొంచెం పసుపు కలపండి. పసుపు కల్తీ అయితే నీటి రంగు పసుపు రంగులోకి మారుతుంది. పసుపు గ్లాసు కిందికి వెళుతుంది. కల్తీ పసుపు ఉన్న నీరు మరింత పసుపు రంగులో కనిపిస్తుంది.

### పండ్లు

చాలా వరకు కల్తీ పండ్లు, కూరగాయలలో ముఖ్యంగా ఆపిల్స్ లో జరుగుతుంది. మరింత మెరిసేలా చేయడానికి, దానిపై మైనపు పొరను అప్లై చేస్తున్నారు. కాబట్టి దీన్ని ఎలా గుర్తించాలంటే..? యాపిల్ పైన కత్తితో తేలికగా గీయండి. అప్పుడు మైనపు పొర ఉందో లేదో సులువుగా తెలుస్తుంది.

### మిరియాలు..

మిరియాల్లో కూడా బొప్పాయి గింజలు కలిపి కల్తీ చేస్తున్నారు. కాబట్టి దీన్ని పరీక్షించడానికి, ఒక గ్లాసులో నీటిని తీసుకుని, అందులో మిరియాలు వేయండి. మూడు నాలుగు నిమిషాల తర్వాత అందులో బొప్పాయి గింజలు ఉంటే నీటిపై తేలి కనిపిస్తాయి.

### నెయ్యి

బంగాళ దుంప, శుద్ధి చేసిన నూనెను దేశీ నెయ్యిలో కలపడం ద్వారా కల్తీకి పాల్పడుతున్నారు. ఐతే దాన్ని గుర్తించడానికి, నెయ్యిలో కొద్దిగా అయోడిన్ ద్రావణాన్ని కలపండి. దాని రంగు నీలం రంగులోకి మారితే, నెయ్యిలో పిండి పదార్థం కలపినట్లు గుర్తించాలి.

### మిరపపొడి


ఒరిజినల్ ఎర్ర మిరపకాయ పొడిని గుర్తించడానికి, మిరప పొడిని నీటిలో వేయండి. ఒకవేళ ఎర్ర మిరప పొడి నీటిలో తేలితే అది స్వచ్ఛమైనది. మునిగిపోతే అది కల్తీ అయినట్లు గుర్తించాలి.

### ఇంగువ

నెయ్యి లేదా నూనె కలిపినప్పుడు నకిలీ ఇంగువ రంగు లేత ఎరుపు రంగులోకి మారకపోతే అది నకిలీది. నిజమైన ఇంగువను కాల్చినప్పుడు, అది సులభంగా మంటలను అంటుకుంటుంది, అయితే కల్తీ ఇంగువ త్వరగా మంటలను అంటుకోదు.

### తేనె

నీటి సహాయంతో తేనె నిజమైనదా? నకిలీదా? అనేది గుర్తించవచ్చు. ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా తేనె కలపండి. అది నీటిలో కిందికి చేరితే అది స్వచ్ఛమైనది. అలా కాకుండా నీటిలో కరిగితే అది నకిలీ. తేనెను వైట్ కలర్ క్లాత్ పై వేస్తే అది పీల్చుకోదు. అంతేకాదు దానిపై మరకలు కూడా అంటవు. ఒకవేళ నకిలీ తేనె ఐతే మరకలు అవుతాయి. క్లాత్ లోపలికి పీల్చుకుంటుంది.



# పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్.. నేర్పిస్తున్నారా?



మన దేశంలో చంటి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆడవాళ్లకు రక్షణ లేకుండా పోతోంది. కొన్ని సంఘటనల్లో మైనర్ బాలురపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. దీనిపై ఎంత మౌనంగా ఉంటే అంత ప్రమాదం. పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో చెప్పాల్సిన తల్లిదండ్రులే... పట్టించుకోవడం లేదు. ఒక వ్యక్తి ఏ ఉద్దేశ్యంతో తాకుతున్నాడో పిల్లలు ముందే గ్రహిస్తే సగం ప్రమాదాలను అడ్డుకోవచ్చు. కానీ తల్లిదండ్రులు ఏ టచ్ ఎలాంటిదో.. ఎవరిని దగ్గరగా రానివ్వకూడదో.. ఎవరూ ఎక్కడ తాకకూడదో చెప్పడానికి సంకోచిస్తున్నారు. ఈ ధోరణిని త్వరగా వీడి.. పిల్లలకు ఏది మంచో, ఏది చెడో వివరించాలి అంటున్నారు నిపుణులు.

పిల్లల కిడ్నాప్‌లు, వారిపై వేధింపులు, లైంగికవేధింపులు జరుగుతున్న కేసులను మనం ఎప్పటికప్పుడూ చూస్తూనే ఉంటున్నాం. అయినా సరే కొందరు తల్లిదండ్రులు పిల్లలకు కొన్ని సెన్సిటివ్ విషయాలు నేర్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయి అంటున్నారు నిపుణులు. కాబట్టి తమ పిల్లలను కాపాడుకోవాలనుకునేవారు.. కొన్ని విషయాలు పిల్లలతో చర్చించాలి. ఆలస్యం కాకముందే వారికి మంచి స్పర్శ, చెడు స్పర్శ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కోసం ఈ పద్ధతులు పాటించండి.

### సరైన పదాలను ఉపయోగించండి...

కొంతమంది తల్లిదండ్రులు శరీర భాగాలకు.. ప్రత్యేకించి ప్రైవేట్ భాగాలకు వేర్వేరు మారుపేర్లను ఉపయోగిస్తారు. అయితే ప్రతి శరీర భాగానికి సరైన పదాలను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులు శరీరం గురించి మాట్లాడేప్పుడు విచిత్రంగా భావిస్తే.. అది సిగ్గుపడాల్సిన విషయమని పిల్లలు అభిప్రాయపడుతున్నారు. వారి శరీర భాగాల గురించి సరైన పేర్లను చెప్పడం వలన వాటి గురించి సరిగా కమ్యూనికేట్ చేయగలుగుతారు.

### సంభాషణలు ఆపొద్దు...

మీ పిల్లలు చాలా చిన్నవారని, ఆ విషయాలు వారిని భయపెడతాయని ఆ సంభాషణను అక్కడ ఆపేయొద్దు. పిల్లలు ఎదుటి వారి ముందు సిల్లీగా అనిపించే జోక్స్ వేస్తూ ఉంటారు. కానీ మీరు నవ్వకుండా, తిట్టకుండా ఉండటం చాలా ముఖ్యం. వారి ప్రశ్నలకు సరైన సమాధానం ఇస్తూ.. వారిని కొన్ని విషయాల పట్ల ఎడ్యుకేట్ చేయడం చాలా ముఖ్యం. సంభాషణలకు మార్గనిర్దేశం చేయడంలో సహాయం కోసం పుస్తకాలను ఉపయోగించండి. లేదా టీచర్స్ లేదా శిశు వైద్యులను సంప్రదించండి.

### శరీర భద్రత గురించి..

కారులో సీటు బెల్ట్‌ను పెట్టుకునేటప్పుడు, ఆరోగ్యకరమైన ఆహారం తింటున్నప్పుడు లేదా వీధి దాటడానికి చేతులు పట్టుకున్నప్పుడు దాని గురించి వారికి చెప్పండి. ప్రతి సందర్భంలోనూ వారికి కొన్ని విషయాలు నేర్పించండి. తద్వారా వారు వారి శరీరం విలువను అర్థం చేసుకుంటారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వారిని బాధపెట్టినప్పుడు గట్టిగా, మర్యాదగా మాట్లాడటాలని చెప్పండి.

### అసౌకర్యాన్ని గుర్తించండి...

మన శరీరానికి మనమే యజమాని అని.. పిల్లలకు నేర్పండి. పిల్లలకు ఈ విషయాలు నేర్పడంతో పాటు.. సామాజిక నైపుణ్యాలను సమతుల్యం చేయడం మీకు సవాల్ గా ఉండవచ్చు. కానీ ఇవన్నీ మీరు కచ్చితంగా పిల్లలకు నేర్పాలి. పిల్లలు తమ శరీరం ఎవరి నియంత్రణలోకి వెళ్లకుండా ఇది సహాయపడుతుంది. వీటిని బలవంతంగా కాకుండా.. ప్రేమగా, సున్నితంగా నేర్పించే ప్రయత్నం చేయండి. వివిధ కారణాల వల్ల పిల్లలు వివిధ సమయాల్లో అసౌకర్యానికి గురవుతారు. వారి అసౌకర్యాలను తల్లిదండ్రులు గుర్తించడం చాలా ముఖ్యం. దానికి కారణాలు కూడా తెలుసుకోవాలి.

### తాకడం గురించి మాట్లాడండి..

పిల్లలకు మంచి, చెడు టచ్‌ల గురించి చెప్పండి. వీపుపై తట్టడం వంటి సురక్షితమైన స్పర్శలు లేదా కౌగిలింతలు మృదువుగా అనిపిస్తాయి. కొట్టడం లేదా ఇతర భాగాలు పట్టుకోవడం వంటి అసురక్షిత స్పర్శలు పిల్లల శరీరం లేదా భావాలను దెబ్బతీస్తాయి. చెడు స్పర్శలు గురించి చెప్తున్నప్పుడు మీకు భయంగా లేదా అసహ్యంగా అనిపించవచ్చు కానీ.. అవే వారిని కొన్ని సందర్భాల నుంచి రక్షిస్తాయని గుర్తించుకోండి. కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు నో చెప్పడం లేదా తిరస్కరించడానికి పిల్లలకు తగినంత అధికారం ఇవ్వాలి. వాళ్లకు నచ్చని విషయాన్ని వారు నిర్మొహమాటంగా తిరస్కరించే ధైర్యాన్ని ఇవ్వండి.




# పని ఒత్తిడి నుంచి ఇలా బయటపడండి

**ప్రస్తుతం చాలా మంది ఉద్యోగులను వేదిస్తున్న సమస్య పని ఒత్తిడి.. విపరీతమైన ప్రెజర్ తట్టుకోలేక చాలా మంది జాబ్స్ వదిలేస్తున్నారు. కొంతమంది వేరే కంపెనీలకు మారిపోతున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ కంపెనీల్లో పనిచేసేవాళ్లకు పని ఒత్తిడి సమస్య తీవ్రంగా వేదిస్తోంది. చాలామంది రోజులో ఎక్కువ సమయం ఆఫీసులోనే గడిపేస్తున్నారు. ఇటీవల సీఏ చేస్తున్న ఓ ఉద్యోగి పని ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. లక్షల్లో జీతం వచ్చినా.. కంపెనీ నుంచి వచ్చే ప్రెజర్‌ని తట్టుకోవడం ఆమెను పూర్తిగా క్షీణించేలా చేసింది.**



ప్రపంచవ్యాప్తగా 12 బిలియన్ల మందికి ఇబ్బందులు ప్రపంచవ్యాప్తంగా పని ఒత్తిడితో మరణించేవారి సంఖ్య ఆందోళనని కలిగిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పని ఒత్తిడి వల్ల కలిగే డిప్రెషన్, ఆందోళనతో సంవత్సరానికి 12 బిలియన్ల మంది ఇబ్బందులు పడుతున్నారట. ప్రతి నలుగురు ఉద్యోగులలో ఒకరు ఈ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారట. ఇండియాలో అయితే సరైన కార్మిక రక్షణ చట్టాలు లేకపోవడం వల్ల ఉద్యోగులకు ఈ పని భారం మరింత ఎక్కువ అవుతుందని అధ్యయనాలు చెప్తున్నాయి.

### పని ఒత్తిడి ఎప్పుడు ఎక్కువ అవుతుందంటే..

పనిభారం ఎక్కువ కావడం, లేదా ఇచ్చిన పనిని పూర్తి చేయలేకపోవడం, లే ఆఫ్ ప్రెజర్స్, ఇంక్రిమెంట్స్ ఇబ్బందులు. ఇవన్నీ ఉద్యోగికి ప్రెజర్‌ని ఇచ్చేకారకాలే. ఒక్కోసారి ఇవన్నీ ఒకేసారి ఎదురుకావొచ్చు. ఈ టార్గెట్స్ కంప్లీట్ అయితేనే ఇంక్రిమెంట్ ఇస్తాము. అప్రైజల్ ఇలా చేస్తూనే వస్తుంది కాబట్టి ఈ వర్క్ చేయాలంటూ.. టార్గెట్స్ వల్ల కూడా ప్రెజర్ ఎక్కువ అవుతోందని చెప్తున్నారు. ఇవే కాకుండా వీకెండ్ వర్క్స్, మంథ్ ఎండ్ టార్గెట్స్ కూడా ఉద్యోగులపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

మనశ్శాంతి కోసం ఎటైనా పోవాలన్నా.. లీవ్స్ ఇవ్వడానికి కంపెనీలు ఇబ్బందులు ఇబ్బందులు పెడుతున్నాయి. కొందరు పగలు, రాత్రి తేడా లేకుండా పనిలోనే నిమగ్నమవుతున్నారు.

ఈ కారణాలవల్లే చాలామంది ఫ్యామిలీ లైఫ్‌కి దూరమవుతున్నారు. పర్సనల్ లైఫ్‌ని అనే సంగతిని కూడా మరచిపోతున్నారు. వీటివల్ల మానసికంగా, శారీరకంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిద్ర లేమి, గుండె సమస్యలు, షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఒత్తిడి, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయి.

### ఎలా బ్యాలెన్స్ చేయాలంటే..

ఒత్తిడి లేకుండా పని జీవితాన్ని ముందుకు సాగించాలంటే కొన్ని బౌండరీలు సెట్ చేసుకోవాలి. స్వీయ సంరక్షణకు ప్రాధాన్యతనిచ్చుకోవాలి. పై అధికారి మెప్పు గురించి ఆలోచిస్తూ.. పనికి మించిన భారం తీసుకోకూడదు. మీ స్థోమత లేదా పరిధిని దాటే ఏ వర్క్ కైనా నో చెప్పడం నేర్చుకోండి. మొహమాటంతో సరే చేసేస్తాను అనేది మీకు తలకు మించిన భారం కావొచ్చు. కొలిగ్స్ వర్క్‌ని కూడా మీద వేసుకోవడం మానేయండి. మీకు అప్పగించిన పనిని.. టైమ్ లిమిట్ పెట్టుకుని దానిలోనే కంప్లీట్ అయ్యేలా చూసుకోండి.

### ఫ్రెండ్స్ సాయం తీసుకోండి..!

వర్క్ ప్రెజర్ వల్ల ఒత్తిడి పెరుగుతుంటే మీ ఫ్రెండ్స్, కొలిగ్స్, ఫ్యామిలీ సహాయం తీసుకోండి. వారికి మీ ఇబ్బందిని వివరించండి. ఈ ఒత్తిడి, యాంగ్జైటీ నుంచి బయటపడేందుకు ఇతరుల సహాయం తీసుకోవడంలో తప్పులేదు. పరిస్థితి మీ చేయి దాటిపోతుందని భయం వేస్తే కచ్చితంగా వైద్యులు, నిపుణుల సహాయం తీసుకోండి. పర్సనల్ స్పేస్‌లోకి వర్క్‌ని తీసుకెళ్లకండి. రెగ్యూలర్‌గా వ్యాయామం, యోగా చేసేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.





## రాహుల్ ద్రవిడ్ యజమానిలా వ్యవహరిస్తున్నారు..

- డబ్లిన్ గార్డియన్స్ యజమాని రాహుల్ ద్రవిడ్
- తొలి ఐదు మ్యాచ్‌ల్లో జట్టుకు దక్కని విజయం
- అయినా ద్రవిడ్ జట్టుకు పూర్తి మద్దతిచ్చారని తెలిపిన కోచ్ విక్రమ్ రాథోడ్
- జట్టు నిర్ణయాల్లో ద్రవిడ్ జోక్యం చేసుకోవడం లేదని వెల్లడి
- రోజువారీ క్రికెట్ వ్యవహారాలను అశ్విన్ చూస్తున్నారన్న విక్రమ్

భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ సాధారణంగా కోచ్‌గా కనిపిస్తారు. కానీ యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో ఆయన కొత్త పాత్రలో కనిపిస్తున్నారు. డబ్లిన్ గార్డియన్స్ ఫ్రాంచైజీ యజమానిగా వ్యవహరిస్తున్నారు. అయితే జట్టు తొలి ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా సాధించలేదు. అయినా ద్రవిడ్ ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని ఆ జట్టు కోచ్ విక్రమ్ రాథోడ్ తెలిపారు. టీమిండియా, ఐపీఎల్‌లో ద్రవిడ్‌తో కలిసి పనిచేసిన రాథోడ్‌కు ఆయన్ను యజమాని పాత్రలో చూడటం కొత్త అనుభవం. ‘‘రాహుల్ యజమానిలా వ్యవహరిస్తున్నారు. పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. తొలి దశలో మేం ఐదు మ్యాచ్‌లు ఆడినా ఒక్కటి కూడా గెలవలేదు. అయినా ఆయన పూర్తిగా మాకు మద్దతుగా నిలిచారు’’ అని రాథోడ్ చెప్పారు.

కోచ్‌గా జట్లపై ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ద్రవిడ్‌కు బాగా తెలుసని అన్నారు. ఫలితాలు అనుకున్నట్లు రాకపోయినా ఎలా స్పందించాలో ఆయనకు అవగాహన ఉందన్నారు.

డబ్లిన్ గార్డియన్స్‌లో రవిచంద్రన్ అశ్విన్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని రాథోడ్ వెల్లడించారు. ప్రత్యర్థులపై వ్యూహాలు, జట్టు ఎంపిక వంటి రోజువారీ క్రికెట్ వ్యవహారాలను ప్రధానంగా అశ్విన్ చూసుకుంటున్నారని తెలిపారు.

అశ్విన్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటగాళ్లపై అపారమైన అవగాహన ఉందని రాథోడ్ చెప్పారు. ‘‘అతడిని క్రికెట్ అభిమాని అని పిలుస్తాను. ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది ఆటగాళ్లను, ఎన్ని మ్యాచ్‌లను గమనిస్తాడో ఆశ్చర్యంగా ఉంటుంది’’ అని పేర్కొన్నారు.

భారత క్రికెట్‌లోనే ఎక్కువ కాలం పనిచేసిన తనకు ఈటీపీఎల్ కొత్త అనుభవమని రాథోడ్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అశ్విన్ జట్టులో ఉండటం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. స్థానిక పరిస్థితులు, ఆటగాళ్ల సామర్థ్యంపై అశ్విన్‌కు ఉన్న అవగాహన తన పనిని మరింత సులభం చేసిందని చెప్పారు.



## టీమిండియాలో గాయాల బెడద.. కీలక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ

- స్పోర్ట్స్ సైన్స్ హెడ్ పోస్టుకు మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించిన బీసీసీఐ
- బెంగళూరు సీవోఈలో కీలక బాధ్యతలు
- 2025 మార్చి నుంచి ఖాళీగా ఉన్న పోస్టు
- నితిన్ పటేల్ తర్వాత భర్తీ కాని స్థానం
- ఆటగాళ్ల గాయాలు, ఫిట్‌నెస్‌పై పర్యవేక్షణ

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మరో కీలక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించింది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో ‘హెడ్‌స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్’ పదవికి మళ్లీ దరఖాస్తులు కోరుతోంది. ఈ పోస్టును గతేడాది సెప్టెంబర్‌లోనూ భర్తీ చేసేందుకు ప్రయత్నించినా.. సరైన అభ్యర్థి దొరకకపోవడంతో ప్రక్రియ పూర్తికాలేదు.

ఈ పదవి 2025 మార్చి తర్వాత ఖాళీగా ఉంది. దాదాపు మూడేళ్లు సీవోఈలో సేవలందించిన మాజీ టీమిండియా ఫిజియో నితిన్ పటేల్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ఈ ఖాళీ ఏర్పడింది. 2023 వన్డే ప్రపంచకప్ ముందు జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీల రికవరీలో పటేల్ కీలక పాత్ర పోషించారు.

కొత్తగా ఎంపికయ్యే వ్యక్తి బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ విభాగానికి వ్యూహాత్మక, నిర్వహణపరమైన నాయకత్వం వహించాలి. జాతీయ జట్టు ఫిజియోలు, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ నిపుణులతో పాటు సీవోఈలోని వైద్య సిబ్బందిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆటగాళ్ల గాయాల నివారణ, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్, శారీరక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

కొత్త వైద్య విధానాలు, పరిశోధనలు, సాంకేతికతను ఉపయోగించడం కూడా ఈ పోస్టులో కీలక బాధ్యతలుగా బీసీసీఐ పేర్కొంది. ఆటగాళ్ల ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్, గాయాల ముప్పు తగ్గించడం వంటి అంశాలపై వ్యూహాలను రూపొందించాల్సి ఉంటుంది.

ఈ పోస్టుకు స్పోర్ట్స్ సైన్స్ లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ తప్పనిసరి. డాక్టరేట్ ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తారు. ప్రొఫెషనల్ లేదా ఒలింపిక్ క్రీడల్లో బృందాలకు నాయకత్వం వహించిన కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థి వయసు 60 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపికైన వ్యక్తి సీవోఈలో హెడ్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న మాజీ భారత బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబర్ 30 సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు పిలుస్తారు.

ఈ పోస్టు భర్తీ విషయంలో తొందరపడబోమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే చెప్పారు. సీవోఈలో ప్రస్తుతం సుమారు 16 మంది ఫిట్‌నెస్, రిహాబిలిటేషన్ సేవలు అందిస్తున్నారని.. అయితే వారందరినీ పర్యవేక్షించేందుకు సరైన నిపుణుడు అవసరమని తెలిపారు. అలాంటి నిపుణులు భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ.. ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

- ఇంగ్లండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుల్దీప్
- యార్క్‌షైర్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన వైనం
- బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్
- ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, కోచ్ గంభీర్‌కు గట్టి సందేశం
- భారత, ఇంగ్లండ్ పిచ్‌ల మధ్య ఉన్న తేడాను వివరించిన కుల్దీప్





టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. "ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది" అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.

## స్లెడ్జింగ్‌కు ప్రతీకారం.. తిలక్ వర్మకు చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ..

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో తిలక్ వర్మ, సూర్యవంశీ మధ్య వాగ్వాదం
- తిలక్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో వైభవ్ స్లెడ్జింగ్
- తిలక్ ఫిర్యాదుతో నాకు ఇలాగే జరిగిందంటూ యువ సంచలనం కౌంటర్
- 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ దులీప్ ట్రోఫీని గెలుచుకున్న ఈస్ట్ జోన్
- ఈస్ట్ జోన్ తమను పూర్తిగా డామినేట్ చేసిందన్న తిలక్ వర్మ





దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజు ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సౌత్ జోన్ కెప్టెన్, తెలుగు ఆటగాడు తిలక్ వర్మతో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మైదానంలో వాగ్వాదానికి దిగాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచి, 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టైటిల్‌ను కైవసం చేసుకుంది.

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్లో సౌత్ జోన్ ఇన్నింగ్స్ సందర్భంగా తిలక్ వర్మ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఈ సమయంలో వైభవ్ అతడిని మాటలతో రెచ్చగొట్టే ప్రయత్నం (స్లెడ్జింగ్) చేశాడు. తొలిరోజు తాను బ్యాటింగ్ చేస్తున్నప్పుడు తిలక్ తనను స్లెడ్జింగ్ చేసినందుకు బదులు తీర్చుకున్నాడు.

ఈ క్రమంలో వైభవ్ భుజం తిలక్‌కు తగలడంతో సౌత్ జోన్ కెప్టెన్ అంపైర్‌కు ఫిర్యాదు చేశాడు. అంపైర్ వచ్చి వైభవ్‌తో మాట్లాడుతుండగా.. "సార్, ఫస్ట్ ఇన్నింగ్స్‌లో నాతో కూడా ఇలాగే జరిగింది" అని అతను సరదాగా గుర్తుచేశాడు. ఈ ఘటన మైదానంలో కాసేపు ఉత్కంఠ రేపింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ జోన్.. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత డబుల్ సెంచరీతో చెలరేగడంతో ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్‌ను 325 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించడంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. 201213 సీజన్ తర్వాత ఈస్ట్ జోన్‌కు ఇదే తొలి దులీప్ ట్రోఫీ కావడం విశేషం. ఈ విజయంతో సౌత్ జోన్ వరుసగా రెండోసారి టైటిల్ గెలవాలన్న ఆశలకు గండిపడింది.

ఓటమి తర్వాత సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ స్పందించాడు. ఈ ఫలితం నిరాశపరిచిందని, కానీ ఈ గేమ్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని చెప్పాడు. "నిజం చెప్పాలంటే, ఈస్ట్ జోన్ మమ్మల్ని పూర్తిగా డామినేట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 700 పరుగులు ఇచ్చినప్పుడే మ్యాచ్ మా చేజారింది. వారి బ్యాటర్లకు క్రెడిట్ ఇవ్వాలి. మేం బౌలింగ్‌లో మరికొంత మెరుగ్గా రాణించాల్సింది" అని తిలక్ వర్మ అంగీకరించాడు. ఈ మ్యాచ్‌లో తిలక్ 99 పరుగులు చేసి త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు.

## మహిళల ఆసియా కప్ ఫైనల్లోకి దూసుకెళ్లిన భారత్..

- మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు చేరిన భారత జట్టు
- సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో విజయం
- అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగిన షఫాలీ వర్మ
- బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి కీలక పాత్ర పోషించిన దీప్తి శర్మ

మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22*) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో టీమిండియా ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది.

అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. ఆరంభంలోనే స్మృతి మంధాన (2) వికెట్‌ను కోల్పోయినా, షఫాలీ వర్మ తనదైన శైలిలో బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేసింది. ఆమెకు జతగా




ప్రతిక రావల్ (20) రాణించింది. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24*), రిచా ఘోష్ (21), దీప్తి శర్మ (13) వేగంగా పరుగులు చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగుల మంచి స్కోరును నమోదు చేసింది.

నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్'. బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న భారీ చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో కాయదు లోహర్, సోనాలి కులకర్ణి, లెజెండరీ యాక్టర్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24న ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. అయితే సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్నప్పటికీ ఇప్పటివరకు ట్రైలర్ విడుదల కాకపోవడం నెట్టింట చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తాజాగా, చిత్రబృందం ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో పాల్గొన్న నాని సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ అందరికీ బిగ్ షాక్ ఇచ్చారు. 'ది ప్యారడైజ్' సినిమాకు ఎలాంటి ట్రైలర్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. అత్యున్నత నాణ్యతతో కూడిన సినిమాను ప్రేక్షకులకు అందించడానికి చాలా టీమ్‌లు నిరంతరం కష్టపడుతున్నాయని తెలిపారు.

విడుదలకు తక్కువ సమయం మాత్రమే ఉండటంతో ట్రైలర్ కంటే సినిమా అవుట్‌పుట్‌పైనే తమకు పూర్తి శ్రద్ధ ఉందని, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని నాని వివరించారు. సినిమా విడుదల తేదీ రెండుసార్లు మారడంతో కాస్త సంకోచం కలిగిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. కానీ అభిమానులు చూపిస్తున్న అపారమైన మద్దతు తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. కేవలం సమయభావం కారణంగానే ట్రైలర్‌ను విడుదల చేయలేకపోయామని స్పష్టం చేశారు. అయితే కేవలం టీజర్ చూసిన తర్వాత చాలామంది ఇది కేవలం ఒక హింసాత్మక యాక్షన్ చిత్రం మాత్రమేనని అనుకోవచ్చని నాని అభిప్రాయపడ్డారు. కానీ 'ది ప్యారడైజ్' అనేది కేవలం హింసతో కూడుకున్నది కాదని, ఇదొక అందమైన తల్లి కొడుకుల అనుబంధం పైన, దాని వెనుక ఉన్న బలమైన భావోద్వేగాలపైనా దృష్టి పెడుతుందని నాని తెలిపారు. సినిమా విడుదలైన తర్వాత అసలు కథ ఏంటో థియేటర్లలో చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని నాని చెప్పుకొచ్చారు.

## అభిమానుల మద్దతు మా బాధ్యతను మరింత పెంచింది..



# రామ్‌తో సంయుక్త

రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో-నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ', 'స్లమ్ డాగ్', 'హైందవ', 'ది బ్లాక్ గోల్డ్' చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.



# వెంకటేష్ 'ఆదర్శకుటుంబం' టీజర్ వచ్చేసింది..

విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శకుటుంబం' నుంచి టీజర్ వచ్చేసంది. 'డబ్బుకి సబ్బుకి ఓ పోలిక ఉంది.. మొదటిది చూస్తుండగా కరిగిపోతుంది., రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది' అంటూ వెంకటేష్ డైలాగ్‌తో స్టార్ట్ అయిన ఈ టీజర్‌లో.. కూర, సాంబారు చేశాను అని వెంకటేష్ అనడగా.. పప్పు చెయ్యలేదా అని శ్రీనిధి అడుగుతుంది. దీంతో వెంకీ.. నువ్వు అందినచోటల్లా అప్పు చెయ్యి నేను అప్పు చేస్తాను' అంటూ వెంకీ మామా ఫ్రెస్టేషన్ కనిపిస్తుంది. 'అడుక్కునే వాళ్లకైన ఆదివారం ఉంటుంది కానీ, ఈ అప్పులోలికి మాత్రం ఉండదు.. నాకు ఫ్యామిలీ ఈమేజ్ ఉందని తెలుసు.. కానీ సిట్యుయేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చెయ్యడానికి వెనుకాడను' అనే డైలాగ్స్ టీజర్‌లో హైలెట్‌గా నిలిచాయి. మొత్తంగా ఈ టీజర్ చూస్తుంటే.. శ్రీనిధి అప్పులు చేసే భార్యగా.. వెంకటేష్ బ్యాంక్‌లో జాబ్ చేస్తున్న బాధ్యత కలిగిన భర్తల కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాగా.. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న రిలీజ్ కాబోతున్నది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు




దాదాపు మూడు దశాబ్దాల పాటు బాలీవుడ్‌లో కొనసాగుతూ 50కి పైగా సినిమాల్లో నటించిన ప్రముఖ నటి ప్రీతి జింటా.. గత కొద్ది రోజులు ఇండస్ట్రీకి కాస్త దూరం అయ్యారు. ఇప్పుడు ఓ యాక్షన్ కామెడీ మూవీ 'వైబ్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో ప్రీతి జింటా మేడమ్ హెచ్ అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో నటిస్తున్నారు. వంశిక ధీర్ అనే కొత్త అమ్మాయి ఇండస్ట్రీకి పరిచయం అవుతుండగా, ఆమెతో పాటు కునాల్ కెమ్ము, స్పర్ష్ శ్రీవాస్తవ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 18న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో నటి వంశిక ధీర్ తన సినిమా అనుభవాలను పంచుకున్నారు.

పోస్టర్‌లో తనను తాను చూసుకొని ఆశ్చర్యపోయానని, ట్రైలర్ లాంచ్‌లో పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు తనకు కొద్దిగా ఇంపాస్టర్ సిండ్రోమ్ అనిపించిందని, ఈ భావన ఇంకా పోలేదని తెలిపారు. వంశిక మాటలతో ఏకీభవించిన ప్రీతి జింటా, ఇండస్ట్రీలో ఇన్ని సంవత్సరాలు పనిచేసినప్పటికీ ఏ పాత్రనైనా చేసేటప్పుడు చేయగలనా? లేదా అనే సందేహం ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా తాను తెరపై తన సినిమాలను ఎప్పుడూ చూసుకోలేనని, తన నటనను తాను ఎప్పుడూ సరిగ్గా అంచనా వేసుకోలేనని ప్రీతి చెప్పారు. సినిమా పూర్తయిన తర్వాత ఆ సినిమాను చూడలేనని, థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా అనిపిస్తుందని అన్నారు. మూవీ చూస్తున్నప్పుడు ఇది ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనే ఆలోచనలు వస్తుంటాయని ఆమె తెలిపారు.

## నా సినిమాలు చూసుకునేందుకు చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది



# ఫుల్ స్వింగ్‌లో 'సంబరాల ఏటిగట్టు' పనులు.. బాక్సాఫీసు వద్ద మెగాస్టార్‌తో పోటీ తప్పదా?



మెగా హీరో సాయిదుర్గా తేజ్, టాలెంటెడ్ డైరెక్టర్ రోహిత్ కేపీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, సరిగ్గా అదే సమయంలో జనవరి 13న మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మూవీ 'కాకా' కూడా రిలీజ్ కానుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

*"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పుడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి.*



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S